# 15. ప్రళయ సంకేతాలు

ప్రస్తుత ప్రపంచ పరిస్థితులతో పాటు, క్రమంగా మారుతున్న పర్యావణ పరిస్థితులు గమనిస్తుంటే "పెరుగుట విరుగుట కొరకే" అన్న సామెత నిజమయ్యే సూచనలు కన్పిస్తున్నాయి. ఈనాడు సైన్స్, సాంకేతికవిజ్ఞానం ఆకాశపుటంచులు తాకడానికి ప్రయత్నిస్తుంటే, మానవత్వం రోజురోజుకు పాతాళానికి దిగజారిపోతోంది. ఈ నైతికదిగజారుడు కూడా విశ్వవినాశానికి గోతులు తవ్వుతోంది.

"మేము ప్రళయదినానికి పూర్వం ప్రతి పట్టణాన్ని, జనపదాన్ని సర్వనాశనం చేయడమో లేక కఠినంగా శిక్షించడమో చేస్తాం. ఇది విధివ్రాతలో రాయబడిఉంది." (ఖుర్ఆన్–17:58)

## పదిహేను దుర్లక్షణాలు

చెడుల్ని అరికట్టడం, మంచిని పెంచడం ముస్లింల విధి. వారీ పనులు చేయకుండా పాపకార్యాల్లో కూరుకుపోతే దైవశిక్ష చవి చూడవలసివస్తుంది. దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు:

"నా అనుచర సమాజంలో ఎప్పుడైతే పదిహేను (దుర్)లక్షణాలు చోటుచేసుకుంటాయో అప్పుడు దానిపై ఆపదలు రావడం మొదలవు తాయి. (కొందరీ మాట విని) 'అయితే దైవప్రవక్తా! ఆ లక్షణాలు ఏమిట'ని అడిగారు. దానికి దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు–

"(1) ప్రభుత్వ ఆస్తులను సొంత ఆస్తులుగా పరిగణించడం; (2) అమానత్ (భద్రపరచడానికి అప్పగించబడిన సొత్తు)ను సమర సొత్తుగా తలచడం; (3) (పేదల ఆర్థిక హక్కయిన) జకాత్ ధనాన్ని జరిమానాగా భావించడం; (4) భర్త తన భార్యకు విధేయుడై పోవడం; (5) కొడుకు తన తల్లి పట్ల అవిధేయుడయి ప్రవర్తించడం; (6) మనిషి తన స్నేహితులకు మాత్రమే మేలుచేసి, (7) తన తండ్రిపై దౌర్జన్యం చేయడం; (8) మసీదులో అల్లరి చేయడం; (9) ఒక జాతిలోని అత్యంత నీచుడు ఆజాతికి నాయకుడై పోవడం; (10) వ్యక్తిలోని చెడుకు భయపడి జనం అతడ్ని గౌరవించడం; (11) మత్తుపదార్థాలను బహిరంగంగా వినియోగించడం; (12) పురుషులు పట్టువస్త్రాలు ధరించడం; (13) సంగీత వాయిద్యాలను అవలంబించడం; (14) గాయకురాళ్ళను సమావేశ పరచడం; (15) అప్పటి ప్రజలు తమ పూర్వీకులను నిందించడం, దూషించడం. ఈ లక్షణాలు చోటుచేసుకోవడం ప్రారంభించగానే ప్రజలు ఇక ఎల్లవేళలా దైవశిక్ష కోసం ఎదురుచూడాల్సి వస్తుంది. ఈశిక్ష ఎర్రటి గాలిదుమారం రూపంలోనైనా రావచ్చు, లేదా భూకంపం రూపంలో నైనా రావచ్చు, లేదా సబ్బత్ వాళ్ళకు వచ్చినట్లు ముఖాలు వికృతంగా మార్చివేసే శిక్షయినా రావచ్చు." (తిర్మిజి)



## అలంకారప్రాయమైన మసీదులు

"ప్రళయ సూచనల్లో ఒకటి, ప్రజలు మసీదులు నిర్మించి వాటి పట్ల గర్విస్తారు."; "మీరు తప్పకుండా యూదులు, క్రైస్తవుల మాదిరిగా మసీదుల్ని అలంకరిస్తారు." (అబూదావూద్)

"మీరు మసీదుల్ని అలంకరించడం, ఖుర్ఆన్ గ్రంథాలను అందంగా తీర్చిదిద్దడం ప్రారంభించగానే మీ వినాశకాలం దగ్గర పడిందని గ్రహించండి." (కన్జుల్ఆమాల్)

## స్త్రీల పరిస్థితి

"ప్రళయ సూచనల్లో ఒకటి, బానిసమహిళ తన యజమాను రాలిని కంటుంది..." అన్నారు దైవప్రవక్త–స. (బుఖారి)

పై హదీసులో బానిసమహిళ తన యజమానురాలిని కంటుంది అంటే కుమార్తెలు తమతల్లులపై పెత్తనం చేస్తూ వారిచేత చాకిరి చేయించుకుంటారని అర్థం. పాశ్చాత్య నాగరికత అందజేసిన "హద్దు మీరిన స్త్రీస్వేచ్ఛ" కారణంగానే ఈనాడు యువతులు తమ తల్లుల పట్ల అవిధేయురాలై ప్రవర్తిస్తున్నారు.

దైవపవక్త (స) హితోక్తి : "ప్రళయకాల సమీపంలో ప్రజలు జనసమూహంలో ప్రత్యేక వ్యక్తులకు మాత్రమే సలాం చేస్తారు. వ్యాపారాసక్తి సర్వసామాన్యమై, చివరికి స్త్రీ కూడా తన భర్తకు వ్యాపారంలో సహాయపడుతుంది...." (ముస్నద్అహ్మద్)

ధనార్జన రంగంలో స్త్రీల ప్రవేశంతో నేడు పురుషుల్లో నిరుద్యోగ సమస్య పెనుభూతంలా మారింది. ఇటీవల వెలువడిన ఒక వార్త ప్రకారం అమెరికాలో ఉద్యోగాల్లో స్త్రీల ప్రవేశం మూలంగా దాదాపు లక్షమంది పురుషుల్ని ఉద్యోగాల నుండి తొలగించడం జరిగింది.

## ధనాధిక్యత

"...ప్రళయకాలపు రెండవ సూచన– కాళ్ళకు చెప్పులు, ఒంటికి సరిపడ దుస్తులు లేకుండా మేకలుకాసేవారు పెద్దపెద్ద భవంతులు కట్టడం మొదలెడతారు. ఆ విషయంలో వారు ఒకర్నొకరు మించిపో వడానికి ప్రయత్నిస్తారు" అన్నారు దైవప్రవక్త (స). (బుఖారి)

ఈ హదీసులో అరబ్బుల ప్రస్థావన వచ్చింది. వందేండ్లకు పూర్వందాకా అరబ్బుల పరిస్థితి ఇలాగే ఉండింది. ఆ తర్వాత "తివిరి ఇసుమున తైలంబు తీయవచ్చు" అనే వేమన పద్యపాదం నిజరూపం ధరించడంతో అరబ్బుల జీవనపరిస్థితులు క్రమంగా మెరుగు పడ్డాయి. చమురు సంపదతో వారు కోట్లకు పడగలెత్తి పోటీపడుతూ ఆకాశహర్మ్యాలు నిర్మించుకోసాగారు.

"మీలో సిరిసంపదలు ఎక్కువై ధనికుడు తన దానాన్ని ఎవరు స్వీకరిస్తారా అని చూస్తూ విచారంగా ఉండనంతవరకు ప్రళయం రాదు" అన్నారు దైవప్రవక్త (స). (ముస్లిం)

"సిరిసంపదలు ఎక్కువై సర్వసామాన్యమయ్యే వరకూ ప్రళయం రాదు. ఆకాలంలో ధనికుడు జకాత్ తీస్తాడుగాని దాన్ని తీసుకునే వారెవరూ ఉండరు. చివరికి అరేబియానేల నదులు, పచ్చిక బయళ్ళుగా మారిపోతుంది." (ముస్లిం)

## మహ్‌ది, ఈసా (అలైహి)ల ఆగమనం

ప్రళయసమీపంలో న్యాయశీలుడైన రాజ్యాధినేత "మహ్‌ది" (అలైహి) ప్రభవించి క్రైస్తవులతో అనేకయుద్ధాలు చేస్తారు. ఆ కాలంలోనే యూదులహీరో "ఒంటికన్ను దజ్జాల్" కూడా బయల్పడతాడు. అతని రెండుకళ్ళ మధ్య నుదుటిపై 'కాఫిర్' అనే పదం ఉంటుంది. అతను అసాధారణ శక్తిసామర్థ్యాలు కలవాడైఉంటాడు. అది ముస్లింలకు కఠినకాలం.

ఆ కాలంలోనే ఆకాశంనుంచి ఈసా (అలైహి) అవతరిస్తారు. ఫజర్ నమాజు వేళ రెండు పచ్చవస్త్రాలు ధరించి, ఇద్దరు దైవదూతల రెక్కలపై చేతులుంచి సిరియాలోని ఓ మసీదు మీనారు వద్ద దిగుతారు. నమాజ్ ముగిశాక ఆయన ముస్లింలను వెంటబెట్టుకొని దజ్జాల్‌ని చంపడానికి వెళ్తారు. చివరికి ఆయన (ఇస్రాయీల్ రాజధాని 'టెల్అవివ్'కు కొన్నిమైళ్ళ దూరంలోఉండే) 'లుద్దా'లో తూర్పుముఖద్వారం దగ్గర ఆ దుర్మార్గుణ్ణి హతమారుస్తారు.

ఆ కాలంలోనే యాజూజ్ (తాతారీ), మాజూజ్ (మంగోలీ) అనే జాతులు బయలెడి ప్రపంచంలో తీవ్రమైన అల్లకల్లోలం సృష్టిస్తాయి. ఈసా (అలైహి) కూడా వారి ధాటికి నిలువలేక ముస్లింలను తీసుకొని ఓ కొండపైకి చేరుకొని దైవాన్ని ప్రార్థిస్తారు. దాంతో ఆ జాతులు దైవాగ్రహానికి గురై, దేహాలలో పురుగులు పడి పడిచస్తాయి.

ఈసా (అలైహి) పునరాగమనం, ఆయన కార్యకలాపాలు చూసి ప్రపంచంలోని క్రైస్తవులంతా ఇస్లాం స్వీకరిస్తారు. సర్వత్రా శాంతి, సౌభ్రాతృత్వం, నీతి-న్యాయాలు నెలకొంటాయి. ఏఇద్దరి మధ్యా శత్రుభావం ఉండదు. ధనం విపరీతంగా పెరిగిపోతుంది. దానం స్వీకరించేవారే కన్పించరు. పన్నులు రద్దయి పోతాయి. ఈవిధంగా ఈసా (అలై) ప్రపంచంలో కొన్నేళ్ళు జీవించి, తర్వాత దేవుని సన్నిధికి చేరుకుంటారు. ఆయన భౌతికకాయం మహాప్రవక్త ముహమ్మద్ (స) సమాధి సమీపంలో ఖననం చేయబడుతుంది. ఆ తర్వాత ప్రపంచ పరిస్థితులు అతివేగంగా మారిపోతాయి.

## బంగారు కొండ, అరేబియాలో విగ్రహారాధన

"ప్రళయానికి ముందు ఫురాత్ నది నుండి ఒక బంగారుకొండ బయల్పడుతుంది. దాన్ని స్వాధీనం చేసుకోడానికి జనం యుద్ధంచేస్తారు. ఆ యుద్ధంలో 99% మంది చనిపోతారు..." (ముస్లిం)

"లాత్, ఉజ్జా (విగ్రహా)ల ఆరాధన జరగనంతవరకు రేయిం బవళ్ళు అంతంకావు" అన్నారు దైవప్రవక్త (స). ఇలా అరేబియాలో కూడా విగ్రహారాధన ప్రబలిపోతుంది.



## బహిరంగ వ్యభిచారం

"ప్రళయకాల చిహ్నాలలో మరికొన్ని : విద్యాజ్ఞానాలు అంతరించి, అజ్ఞానం పెరిగిపోతుంది. వ్యభిచారం ఎక్కువైపోతుంది. మద్యపానం సర్వసామాన్యమౌతుంది. పురుష జనాభా తగ్గిపోయి స్త్రీజనాభా పెరుగుతుంది. చివరికి యాభైమంది స్త్రీలను కనిపెట్టుకొని ఉండేందుకు ఒకేఒక పురుషుడు ఉంటాడు." (బుఖారి, ముస్లిం)

"ఒక స్త్రీ ఓ పురుషసమూహం దగ్గర్నుంచి పోతుంది. అప్పుడా గుంపులో నుంచి ఒకడు ఆ స్త్రీ దగ్గరికి వస్తాడు. వచ్చి పశువుతోక పైకెత్తినట్లు అతనామె అంగవస్త్రం పైకెత్తి (అందరూ చూస్తుండగానే) వ్యభిచరిస్తాడు. ఆ గుంపులోనే మరొకతను (ఈ అశ్లీల చేష్ట చూడలేక) 'నువ్వీ పని ఆ గోడ వెనక్కి వెళ్ళి చేస్తే బాగుండేది' అంటాడు. అతనా గుంపులో మీలో అబూబకర్, ఉమర్ (రజి) వంటి (పుణ్యాత్ముడైన) మనిషి." (ఫత్‌హుల్‌బారీ)

## పడమర నుండి సూర్యోదయం

ప్రళయసూచనల్లో కాళరాత్రి, సూర్యుడు పడమర దిక్కు నుండి ఉదయించడం గురించి, 'భూమినుండి బయల్పడే విచిత్రజంతువు' గురించి కూడ ప్రస్తావించారు దైవప్రవక్త (స).

ఆ కాళరాత్రి సుదీర్ఘంగా ఉంటుంది. బాటసారులు ఎంత నడిచినా సూర్యోదయం కాకపోవడంతో ఆందోళన చెందుతారు. పడుకున్న పిల్లలు సుదీర్ఘరాత్రితో విసిగిపోతారు. పశువులు మేతకోసం అడవులకు పోవడానికి అరుస్తాయి. అయినా సూర్యుడు ఉదయించడు. ప్రజలు కంగారుపడుతూ లేచి సుదీర్ఘ ప్రార్థనలుచేస్తూ తమ పాపాలు క్షమించమని దైవాన్ని వేడుకుంటారు. ఆ కాళరాత్రి మూడు నాలుగు రాత్రులంతా సుదీర్ఘంగా ఉంటుంది. చివరికి సూర్యుడు బలహీనకాంతితో మినుకు మినుకుమంటూ పడమర నుంచి ఉదయిస్తాడు. అప్పుడు సూర్యునికాంతి గ్రహణం పట్టిన చంద్రుని కాంతిలా మసకమసకగా ఉంటుంది. (ముస్లిం)

అప్పుడు అవిశ్వాసులు సత్యాన్ని విశ్వసించినా ప్రయోజనం ఉండదు. అలాగే సత్యాన్ని విశ్వసించి, సత్కర్మలు ఆచరించనివారు ఆరోజు ఎన్ని సత్కార్యాలు చేసినా లాభంలేదు.

## నిరంతర విపత్తులు

దైవప్రవక్త (స) హితోక్తి: "సూర్యుడు పశ్చిమదిక్కున ఉదయించిన తర్వాత మానవులు ప్రపంచంలో మరో 120 ఏళ్ళు జీవిస్తారు. ఆతర్వాత ప్రళయం వస్తుంది." (ఫత్‌హుల్‌బారీ)

ముస్లిం గ్రంథం ప్రకారం ప్రళయం పరమదుర్మార్గుల మీద వచ్చి పడుతుంది. మరొక ఉల్లేఖనంలో ప్రపంచంలో దేవుని పేరు స్మరించబడుతున్నంత కాలం ప్రళయం రాదని ఉంది. చివరికి దేవుని పేరు స్మరించబడని దుర్దినాలు కూడా దాపురిస్తాయి.

లోకం అంత్యదశకు చేరుకుంటుంది. పర్యావరణంలో పెను మార్పులు వస్తాయి. పాపాలు మరిన్ని పెరిగిపోతాయి. ప్రజలలో నీతినియమాలు పూర్తిగా అడుగంటిపోతాయి.

ఒకదాని తర్వాత ఒకటి అనేక భూకంపాలు వస్తాయి. ఆకాశంనుండి రాళ్ళవర్షం కురుస్తుంది. పూసలదండ తెగి పూసలు క్రింద పడిపోయినట్లు ప్రకృతివైపరీత్యాల రూపంలో అనేక విపత్తులు వరుసగా వచ్చిపడతాయి.

ప్రజలు పూర్తిగా ఐహిక వ్యామోహంలో మునిగి చెడులలో కూరుకుపోయి ఉన్నప్పుడు ప్రళయం విరుచుకు పడుతుంది.

ఒక హదీసు ప్రకారం ఇద్దరు వ్యక్తుల మధ్య వ్యాపారవ్యవహారం జరుగుతుంటుంది. వ్యాపారి బట్ట తీసి కొనుగోలుదారునికి చూపిస్తుం టాడు. అయితే బేరం కుదిరి బట్ట మడతపెట్టక ముందే ప్రళయం వచ్చిపడుతుంది. ఒకతను ఒంటె నుండి పాలుపితికి తీసికెళ్తుంటాడు. కాని ఆ పాలను ఇంకా తాగకముందే ప్రళయం వస్తుంది. మరొకతను నీళ్ళతొట్టిని అలుకుతుంటాడు. అతను తన పశువులకు నీళ్ళు తాగించను కూడా లేడు, అంతలో ప్రళయం వచ్చిపడుతుంది. వేరొకతను భోజనం చేయడానికి కూర్చుని అన్నంముద్ద నోటి దగ్గరికి తీసికెళ్తాడు. కాని నోట్లో పెట్టుకోక ముందే ప్రళయం విరుచుకుపడుతుంది.

## ప్రళయ శంఖారావం

మొదటిసారి శంఖారావం విన్పించగానే జనం తీవ్ర భయాందో ళనలతో మెడలు ఒక వైపుకు వంచి కళ్ళు తేలేసి చూస్తారు. కఠోరమైన ఆ శబ్దానికి చెవులు చిల్లులుపడతాయి. గుండెలు దడదడలాడుతాయి. పతి మనిషీ భీతావహంతో తన ఆప్తుల్ని, రక్తసంబంధీకుల్ని సైతం వదిలేసి పరుగెత్తుతాడు. ఏఒక్కడికీ తనను గురించి తప్ప ఇతరుల్ని గురించిన ఆలోచనే రాదు. చివరికి తల్లి పాలిస్తున్న తన పసిబిడ్డను కూడా వదలి పరుగెత్తుతుంది. గర్భిణీలకు గర్భస్రావం అవుతుంది. పశువులు భయంతో అటూఇటూ పరుగెత్తుతాయి.

## విశ్వవినాశం, సర్వనాశనం

రెండవసారి శంఖారావంతో మానవులతో పాటు యావత్తు జీవరాసులు చచ్చి పడిపోతాయి. భూమి తీవ్రమైన ప్రకంపనాలతో ఎక్కడి కక్కడ నెర్రెలు విచ్చుకుంటుంది. పెద్దపెద్ద కట్టడాలు సైతం పేకమేడల్లా కూలిపోతాయి. ప్రచండవేగంతో గాలులు వీస్తాయి. సముద్రాలు ఉవ్వెత్తున ఎగిసిపడతాయి. లక్షలాది ఎకరాల నేల జలమయమవుతుంది. సముద్రంలో పెద్దఎత్తున అగ్నిమంటలు లేస్తాయి. బ్రహ్మాండమైన ప్రభంజనం వల్లనో, గురుత్వాకర్షణ శక్తి తగ్గిపోవడం వల్లనో భూమి మీదుండే ప్రతివస్తువూ గాలిలో తేలి యాడుతుంది. పర్వతాలు మొదట్లో నేలనుండి పెకిలి దూదిపింజల మాదిరిగా తేలుతాయి. తర్వాతవి తునాతునకలై ఇసుక రేణువులుగా మారి ఎగురుతాయి. భూగోళం అతలా కుతలమవుతుంది.

అలాగే ఆకాశంలోనూ అనూహ్యమైన మార్పులు జరుగుతాయి. మొదట నక్షత్రాలు కాంతి కోల్పోతాయి. సూర్యచంద్రులు కూడా నిస్తేజమై పోతాయి. చంద్రుడు గురుత్వాకర్షణ



కోల్పోయి సూర్యునికి అతుక్కుపోతాడు. గ్రహాలు, నక్షత్రాలు తమ కక్ష్యలు వదలి ఉదజని బంతుల మాదిరిగా తిరుగుతూ అణుబాంబుల్లా పేలిపోతాయి.

## పునరుత్థానం (Day of Judgement)

అలా విశ్వం రూపురేఖలు మారిపోయి నూతనవిశ్వం ఏర్పడుతుంది. భూమి సాగదీయబడి చదునైన మైదానంగా మారుతుంది. తరువాత దేవుడు మంచులాంటి వర్షం కురిపిస్తాడు. దాంతో మృతమానవులు మొక్కల మాదిరిగా మొలకెత్తుతారు. మూడోసారి శంఖారావంతో ఆది నుండి ప్రళయం దాకా పుట్టిన మానవులంతా పునర్జీవులై నగ్నశరీరాలతో లేచి ఒక దిశగా పరుగెత్తుతారు.

“(ఆరోజు) మానవులు సజీవుడు, శాశ్వితుడైన దేవుని ముందు తలలువంచి నిలబడతారు. దుర్మార్గం, దౌర్జన్యాల పాపం మోసుకొచ్చినవాడు ఆరోజు సర్వనాశనమైనట్లే. సత్కార్యాలు చేసి వుండటంతో పాటు విశ్వాసి కూడా అయివుండినవాడికి ఎలాంటి నష్టంగాని, అన్యాయం గాని జరుగుతుందన్న భయముండదు.” (ఖుర్ఆన్–20)